నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, సెప్టెంబరు 22: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమ, మంగళవారాల్లో పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4:30 గంటలకు నేలకొండపల్లి మార్కెట్ కమిటీ పదవీ ప్రమాణస్వీకారంలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 11:30 గంటలకు కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభిస్తారు. అనంతరం ఉన్నత పాఠశాలలో అదనపు గదులు ప్రారంభిస్తారు. పీఎస్సార్ ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో 640 మంది విద్యార్థినులకు సైకిళ్లు బహూకరిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు కూసుమంచిలో అందుబాటులో ఉంటారు.



కొత్తగూడెంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు

- నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ పనిచేశారు
- కష్టజీవుల రాజ్యాన్ని సాధించడమే ఆయనకు నివాళి
- దేశం గొప్ప మేధావిని కోల్పోయింది
- వామపక్షాలు, ఇతర పార్టీల నేతల నివాళి
- కొత్తగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

6



కొత్తగూడెంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- సంక్షేమ బోర్డు కోసం కేంద్రంపై రవాణా రంగ కార్మికులు పోరాడాలి
- కార్మికులపై భారాలు మోపుతున్న మోదీ సర్కారుపై ఉద్యమించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- కొత్తగూడెంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు
- ఎరుపెక్కిన పట్టణం

ఆటో కార్మికులను ఆదుకోవాలి

6

ఖమ్మం నగర నడిబొడ్డున ఏడు ఎకరాల స్థలంలో కొత్త బస్టాండ్ కొలువుదీరి ఉంటుంది. ప్రతి రోజూ వందలాది బస్సులు, సుమారు లక్షన్నర మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఐదు అంతస్థుల్లో 40 వేల చదరపు అడుగుల్లో ఐటీ హబ్ రాజసం ఒలకబోస్తూ ఉంటుంది. పదుల కొద్దీ ఐటీ కంపెనీలు.. వందల కొద్దీ ఉద్యోగులు ఇక్కడ పని చేస్తుంటారు. గట్టయ్య సెంటర్, బైపాస్ రోడ్డు సమీపంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు నిత్యం రద్దీగా కనిపిస్తూ ఉంటాయి. ఖమ్మం నగరానికి ప్రత్యేక గుర్తులుగా వీటిని ఉదహరిస్తుంటారు. అయితే ఇవేవీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు కనిపించలేదట. నిర్మాణాలు పూర్తయి యేళ్లకాలం నుంచి అక్కడ కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ అధికారులు వాటికి నేటివరకు ట్యాక్స్ అసెస్‌మెంట్లే వేయక పోవడం గమనార్హం. సామాన్యుల నుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేసే అధికారులు.. పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చే నిర్మాణాలపై ఉదాసీనత ప్రదర్శించడం వెనుక పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బొక్కసానికి గండి



ప్రైవేటు రైతు బజార్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు..

ప్రభుత్వ కార్యాలయాలే కాదు.. నగరంలో ఏర్పాటు చేసిన పలు ప్రైవేటు రైతు బజార్లకు సైతం కార్పొరేషన్ అధికారులు పన్నులు వేయకపోవడం గమనార్హం. నగరంలో ఐదుకుపైగా మార్కెట్‌లు ఉండగా... వాటికి సైతం అధికారులు ఎలాంటి అసెస్‌మెంట్లు వేయలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. బోనకల్లు రోడ్డులో ఓ పాఠశాలకు సమీపంలో 25కు పైగా కమర్షియల్ షట్టర్లు నిర్మించి అద్దెకు ఇవ్వగా వాటికి, రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్వహిస్తున్న అద్దె భవనంలోనూ పదులకొద్దీ షట్టర్లు ఉన్నాయి. వాటికి కూడా పన్నులు వేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకటి రెండు కాదు వందలకొద్దీ భవన నిర్మాణాలకు ఎలాంటి అసెస్‌మెంట్లు వేయడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన భవన నిర్మాణాలకు రూ. లక్షల్లో పన్నులు వేయాల్సి ఉండగా.. అందులో ఎంతోకొంత తీసుకుని జేబులు నింపుకుని పట్టించుకోకుండా వదిలేస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ విభాగంలో ఉన్న కొందరు అధికారులకు సమీప మిత్రులని కొందరికి అసెస్‌మెంట్లు వేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసెస్‌మెంట్లపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవి ఆస్తులు కావా?

- కొత్త బస్టాండ్, ఐటీ హబ్‌లకు పన్ను మదింపు చేయని కేఎంసీ
- కోట్లాది రూపాయల ఆదాయానికి గండి
- వెజ్, నాన్ వెజ్ మార్కెట్లదీ అదే పరిస్థితి
- ప్రైవేటు రైతుబజార్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లపైనా పట్టింపు లేదు..
- అదే సామాన్యులైతే ముక్కుపిండి వసూలు
- విస్మయం కలిగిస్తున్న మునిసిపల్ కార్పొరేషన్ తీరు

ఖమ్మం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన వనరుల్లో పన్నులు కూడా ఒకటి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్పొరేషన్‌కు రావాల్సిన రూ. కోట్ల ఆదాయానికి గండి పడుతున్నట్టుగా స్పష్టమవుతోంది. ఖమ్మం పాత బస్టాండ్‌కు రూ. 1,61,512 పన్ను వేయగా, ఆర్టీసీ డిపోకు 29,790 వార్షిక పన్ను విధించగా.. వాటిని గతేడాది వరకు చెల్లించారు. వాటితోపాటు ఆర్టీసీకి సంబంధించిన ఇతర కాంప్లెక్స్ షట్టర్లకు కూడా గతంలో పన్నులు విధించిన అధికారులు.. ప్రస్తుతం 30కి పైగా షట్టర్లు ఉన్న నూతన బస్టాండ్‌కు మాత్రం పన్ను విధించలేదు. దానికి సుమారు వార్షికానికి రూ. 4 లక్షల వరకు పన్ను విధించే అవకాశం ఉండగా.. 2021నుంచి నాలుగేళ్లుగా దానికి అసెస్‌మెంట్ వేయకపోవడంతో సుమారు 16 లక్షల వరకు కార్పొరేషన్ ఆదాయాన్ని కోల్పోయినట్టుగా తెలుస్తోంది. 2020లో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు నాలుగు అంతస్థుల భవనాన్ని నిర్మించగా దానికి సైతం వార్షికానికి రూ. 3 లక్షల చొప్పున రూ. 15 లక్షల వరకు పన్ను విధించే అవకాశం ఉంది అయినప్పటికీ ఐదేళ్ల కాలం నుంచి నేటికి కనీసం అసెస్‌మెంట్ వేయకపోవడం గమనార్హం. ఇక బస్టాండ్‌కు దగ్గరలో బైపాస్‌లో 30 కుంటల్లో ఏర్పాటు చేసిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లో కూడా 36 షట్టర్లతోపాటు, ఇతర నిర్మాణాలు, గట్టయ్యసెంటర్‌కు సమీపంలో ఉన్న మార్కెట్‌లోనూ 30 వరకు షట్టర్లతోపాటు, షెడ్‌ను ఏర్పాటు చేయగా వాటికి కూడా అసెస్‌మెంట్లు వేయకపోవడంతో యేడాదికి రూ. 2.50లక్షల వరకు ఆదాయం కోల్పోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ నాలుగు నిర్మాణాలకే రూ. 50 లక్షలకు పైగా కార్పొరేషన్ ఆదాయాన్ని కోల్పోయినట్టుగా స్పష్టమవుతోంది.

ఆర్టీసి కాంప్లెక్స్‌లో, డిపోకు సంబంధించిన కమర్షియల్ కాంప్లెక్స్‌లలో నిర్వహిస్తున్న దుకాణాలకు సంబంధించి పన్నులు విధించగా.. యేళ్ల తరబడి ఆయా పన్నులు వసూలు చేయనట్టుగా తెలుస్తోంది. ఫలితంగా పన్నుకు మించి వడ్డీలు పేరుకుపోతున్నాయి. ఉదాహరణకు మామిళ్లగూడెంలో ఏపీఎస్‌ఆర్టీసీ మేనేజర్ పేరుతో ఉన్న ఓ షట్టర్‌కు సంబంధించి రూ. 9980 పన్ను ఉండగా.. దానికి సంబంధించి వడ్డీ మాత్రం రూ. 11,792 ఉండటం కొసమెరుపు. ఇలా ఆర్టీసీకి సంబంధించిన దుకాణాల పన్నులు రూ. 2 లక్షలకు పైగా పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. అసలే పన్నులు వేయకపోవడం, వేసిన పన్నులు వసూలు చేయడం వెనుక మర్మమేమిటో ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.

పన్నులు మినహాయింపు వీరికే....

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ హాస్టళ్లు, స్మశాన వాటికలు, మున్సిపల్ భవనాలు, చారిటబుల్ షెల్టర్‌లు, చారిటబుల్ లైబ్రరీలు, చారిటబుల్ ఆటస్థలాలు, ఎక్స్ సర్వీస్‌మెన్, సర్వీస్‌మెన్‌లు వారి కుటుంబ సభ్యులు, పురాతన స్మారక చిహ్నాలు, దార్మికపరమైన, ప్రజలు పూజలు నిర్వహించుకునే వాటికి మాత్రమే పన్నుకు మినహాయింపు ఉంటుంది.



యువతకు అభివాదం చేస్తున్న 'మంగళవారం' ఫేమ్ పాయల్, 'డీజే టిల్లు' ఫేమ్ నేహాశెట్టి

తారలు దిగివచ్చిన వేళ..

7

కొత్తగూడెంలో సినీ తారలు తళుక్కుమన్నారు. తమ అందచందాలతో, హావభావాలతో యువతను అలరించారు. సినీ హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, నేహాశెట్టి ఆదివారం కొత్తగూడెంలోని విద్యానగర్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. షాపింగ్‌మాల్‌లో మెన్, ఉమెన్ కలెక్షన్స్‌ను చూసి మురిసిపోయారు. ఈ సందర్భంగా తాము నటించిన సినిమాల్లోని పాటలకు ఉత్సాహంగా స్టెప్పులేశారు. పాయల్, నేహాలను చూసేందుకు యువత పెద్దఎత్తున రావడంతో ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది.

-చుంచుపల్లి (కొత్తగూడెం)



బ్యాంకులో రుణదందా

- అమాయకుల పేరిట రుణాల మంజూరు
- కొంత ఇచ్చి, మిగిలినదంతా నొక్కేసిన వైనం
- ప్రైవేటు వ్యక్తితో కుమ్మక్కైన మేనేజర్?
- రూ.2కోట్లకు పైగా దందా జరిగినట్టు అనుమానాలు
- వినాయకపురం యూనియన్ బ్యాంకులో బాగోతం
- మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు.. రహస్యంగా విచారణ..
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం

వివరాలు : 6లో

పీడీఎస్‌యూ పోరాటాలు చరిత్రాత్మకమైనవి..

- పౌర సమాజాన్ని మేలు కొల్పేందుకే స్వర్ణోత్సవాలు
- 50 ఏళ్ల ఉద్యమాల ఫలితమే ప్రభుత్వ విద్యా వ్యవస్థ
- ఓయూ ప్రొఫెసర్ కాశీం, మాస్‌లైన్ నేత పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 22: పదేళ్లుగా దేశంలో రాజకీయ నాయకులు, మేధావులు, ఉద్యమకారులపై రాజకీయ కక్షపూరిత వాతావరణం నెలకొందని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇటువంటి పరిణామం ప్రమాదకరమని, అందుకోసమే పౌర సమాజాన్ని మేలు కొల్పేందుకే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ వేడుకలు జరుగుతున్నాయని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు.

ఆదివారం ఖమ్మం ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సన్నాహక సభను నిర్వహించారు. స్వర్ణోత్సవ సభ జెండాను అమరవీరుల స్థూపం వద్ద పీడీఎస్‌యూ వ్యవస్థాపక నాయకుడు వడ్డెల్లి కృష్ణమూర్తి ఆవిష్కరించారు. అనంతరం రాయల రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడారు. జార్జిరెడ్డి విప్లవ స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం 1974 సెప్టెంబరు 12న గుంటూరు, విజయవాడ, ఖమ్మం,హైదరాబాద్‌లో ఒకే సారి పీడీఎస్ పేరుతో విద్యార్థి సంఘం ఏర్పడి తర్వాత కాలంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంగా మారిందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పురుగుల అన్నం స్థాయి నుంచి కార్పొరేట్ విద్య స్థాయి వరకు అందుబాటులోకి (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఓయూ ప్రొఫెసర్ కాశీం



సాగర్ కాల్వలో ధ్వంసమైన యూటీని తొలగిస్తున్న దృశ్యం



పాలేరు జలాశయం వద్ద ధర్నా చేస్తున్న రైతుసంఘం నేతలు

కొనసాగుతున్న మరమ్మతులు

- సాగర్ ఎడమ కాలువలో అండర్ టన్నెల్ స్థానంలో పైపుల ఏర్పాటు
- రేపు సాయంత్రానికి నీరు విడుదల చేసే అవకాశం
- ఎండుతున్న పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన ప్రధాన పార్టీల నేతలు
- మంత్రి పొంగులేటి వెంటనే రావాలని డిమాండ్

కూసుమంచి, సెప్టెంబరు 22: కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద సాగర్ ఎడమకాల్వ వద్ద పురాతన యూటీ తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కాలువ మరమ్మతులు పూర్తి అనంతరం శనివారం నీరు విడుదల చేయగా, యూటీ మిడిల్ వాల్ కూలిపోయి బుంగద్వారా నీరంతా ఏట్లోకి వెళ్లిన విషయం తెలిసిందే. వెంటనే అప్రమత్తమైన అధికారులు రింగ్‌బండ్ వేసి నీటిని నిలిపివేశారు. అయితే 1970 ప్రాంతంలో కట్టిన యూటీ కావడంతో శిథిలావస్థలోకి వచ్చిందని భావించి దానిని పూర్తిగా తొలగించి, దానిస్థానంలో సిమెంట్ పైపులు వేసే పనిలో ఉన్నారు. పాత యూటీ సుమారు ఆరు అడుగుల లోతులో ఉండటంతో నాలుగు ఎక్స్‌కవేటర్‌ల సాయంతో రాళ్లు, ఇసుక, ఇతరత్రా ఆదివారం రాత్రికి తొలగింపు ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రానికి సిమెంట్ పైపులు ఏర్పాటుచేసి సాగర్ జలాలు ఆయకట్టుకు విడుదల చేస్తామని ఐబీ ఈఈ అనన్య తెలిపారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం: జేడీఏ పుల్లయ్య

సాగర్ ఎడమకాల్వకు గండి కారణంగా ఎండుతున్న వరి పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం పరిశీలించారు. మండలంలోని మల్లాయిగూడెం, జుజ్జులరావుపేట గ్రామాల్లో పంటలను అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, కూసుమంచి ఏడీఏ సరిత, ఏవో వాణి తదితరులు పంటలను పరిశీలించారు. జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు విజ్ఞప్తి మేరకు అధికారులు పంటలను పరిశీలించారు. సాగర్ కాల్వ గండ్లు పూడ్చివేతలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తామ పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశీలించిన రైతు సంఘాలు

పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమకాల్వకు పడిన గండి ప్రాంతాలను ప్రతిపక్ష పార్టీ నేతలు, అనుబంధ రైతుసంఘాల నేతలు వేర్వేరుగా పరిశీలించారు. బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ, న్యూడెమోక్రసీ పార్టీలు, రైతు సంఘాల నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా పాలేరు జలాశయం వద్ద ధర్నా నిర్వహించారు. సాగర్ ఎడమ కాలువ గండిపూడ్చివేత పనులను వెంటనే పూర్తిచేసి రైతుల సాగులో ఉన్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. అతివృష్టితో పంటలు దెబ్బతింటే.. ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (మిగతా 6వ పేజీలో)

రాష్ట్ర జట్టులో ప్రతి జిల్లాకు ప్రాతినిధ్యం ఉండాలి

» తెలంగాణా జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ప్రతినిధులు



శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిని కలిసిన జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 22: రాష్ట్ర జట్టులో ప్రతి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించేలా ఉండాలని తెలంగాణా జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ప్రతినిధులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణా క్రికెట్ దశ-దిశ రౌండ్‌టేబుల్ సమావేశంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డిని కలిసి ఆయనకు వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే ప్రతి జిల్లాలోనూ అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమని వారు విన్నవించారు. రాష్ట్రంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అవినీతిలో మునిగి గ్రామీణ క్రీడాకారు లను నిర్లక్ష్యం చేయడం ద్వారా జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాట్స్ చర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ జిల్లాలలో క్రికెట్ క్రీడను అభివృద్ధి చూపేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణా జిల్లాల క్రికెట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం బాధ్యుడు మతిన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడైన అదనపు కలెక్టర్

» పదో తరగతి విద్యార్థులకు మెళకువలు నేర్పిన మధుసూదన్‌నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఏన్కూరు, సెప్టెంబరు 22: ఏన్కూరు కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని బీసీ హాస్టల్‌ను ఆదివారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వంట గదులను, భోజనశాలను, తరగతి గదులను పరిశీలించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతి పరీక్షల్లో ఎలా రాయాలనే దానిపై మెళుకువలను నేర్పించారు. 10/10 జీపీఏ సాధనకు మెళుకువలను సూచించారు. జీవితంలో పదో తరగతే తొలి మెట్టన్నారు. నేటి సమాజంలో చదువే గౌరవాన్ని ఇస్తుందన్నారు. చిన్ననాటి నుంచే లక్ష్యంతో చదవాలన్నారు. లక్ష్యసాధనకోసం నిరంతరం శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. దశలవారీగా హాస్టళ్ల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన బాలికలను అభినందించారు. బీసీ హాస్టళ్లలో 12మంది విద్యార్థులుండడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈవిషయంపై జిల్లా బీసీ సంక్షేమ అధికారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి పైరును రక్షించుకునేందుకు

రైతుల అగచాట్లు



వరి పైరును కాపాడేందుకు ఆయిల్ ఇంజన్ వద్ద ఓ రైతు ప్రయాస

కల్లూరు, సెప్టెంబరు 22: ఈ సీజన్‌లో మండలంలో సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన వరి పైరుకు గత పక్షం రోజులు నుంచి సాగునీరు అందక పొట్టదశకు చేరిన వేలాది ఎకరాల పంట ఎండి పోతున్నది. సాగర్ ఆయకట్టు కింద మండలంలో 31 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేశారు. గత నెల 31 న తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరదలతో సాగర్‌కాల్వపై ఎగువన భారీగా గండ్లు పడటంతో నాటి నుంచి 20 రోజులకు పైగా కాల్వల ద్వారా సాగునీటి సరఫరా జరుగలేదు. దీంతో నీటి ఎద్దడి ఏర్పడింది. ఫలితంగా సాగర్ ఆయకట్టు కింద మెరక పొలాలు (పొట్టదశకు) నెర్రలు ఇచ్చి ఎండి పోయే దశకు చేరుకుంటుండగా పలువురు రైతులు ప్రత్యామ్నాయ దిశగా సాగునీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు భగీరథ యత్నం చేస్తున్నారు. మరో వైపున ఈ ఏడాది ఎడతెరిపి లేకుండ వర్షాలు కురిసిన, సాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్న, కాల్వపై పడిన గండ్లు రైతులకు శాపంగా మారినాయి. ఈ పరిస్థితులో ఈ వానాకాలం వ్యవసాయం రైతుకు అదనపు ఆర్థిక భారంగా మారింది. అందుకు నిదర్శనగా వాగులు, వంకలు, చెరువుల, కుంటల, నేల బావుల, బోర్లను ఆధారంగా చేసుకొని పంట పొలాలకు నీటిని తోడి అందించేందుకు ఆయిల్ ఇంజన్ల కోసం పైపులు, ట్యూబులు, సైపన్లు, అద్దెకు తెచ్చి సాగునీరు అందించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పగలంత వరి పొలాలకు పరిమితమైన రైతులు సుమారు అర కి.మీ వరకు వాటిని ఏర్పాటు చేసుకొని తద్వారా నీటి తడులు అందిస్తున్నారు. పై విధంగా ఒక ఎకరానికి సగటను తడిని అందించేందుకు పది గంటల సమయం పడుతుందని బాధత రైతులు చెప్తున్నారు. అందుకు గాను ఎకరాకు రూ. 3,500 అవుతున్నాయని వాపోతున్నా రు. గత ఏడాది వర్షభావంతో రెండు పంటలు కోల్పోయిన ఈ ప్రాంత రైతులు ఈ ఏడాది వానకాల సీజన్ ఆశాజనకంగా ఉంటుందని భావిస్తే చివరకు సాగర్ కాల్వ గండ్లు కంట తడిని మిగిల్చాయని పలు గ్రామాల రైతుల ఆవేదన చెందుతున్నారు. చేతికి వచ్చే పంటను కాపాడే ప్రయత్నంలో రైతులు అందుబాటులో ఉన్న సాగు నీటి వనరులను ఆధారంగా చేసుకుని ప్రత్యామ్నాయంగా సాగునీరు అందించేందుకు నానా అగచాట్లు పడుతున్నారని చెప్పవచ్చు.

కేఎంసీ ఆదాయానికి వరదల గండి



- నేటి నుంచి బకాయి బడా భవనాలకు రెడ్ నోటీసులు
- 30తో ముగుస్తున్న అర్ధ సంవత్సర ట్యాక్స్ వసూళ్లు గడువు
- వసూళ్ల లక్ష్యం రూ. 32 కోట్లు, వచ్చినవి రూ. 12.46 కోట్లు
- ఈ నెలలో వచ్చింది కేవలం రూ.12లక్షలే
- వారంలో పూర్తి కావాల్సిన లక్ష్యం రూ.18.5 కోట్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 22: భారీ వర్షాలతో మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలతో పాటుగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయాన్ని నిండుగా ముంచిందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అర్ధ సంవత్సరం ట్యాక్స్ కలెక్షన్ సమయానికి వరదలు రావటంతో రెవెన్యూ విభాగంలో పనిచేసే అధికారుల నుంచి ఉద్యోగుల వరకు మున్నేరు వరద ప్రాంతాల్లో విధులు కేటాయించారు. దీంతో కీలకంగా ట్యాక్స్ వసూళ్ళ చేయాల్సిన రోజులు మున్నేరు సర్వే, పునరావాసం, బాధితుల గుర్తింపు, పరిహారం పంపిణీకే సరిపోయింది. ఇక చివరి 9 రోజులే మిగలటంతో అధికారులు హడావుడి పడుతున్నారు. ఈ క్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ట్యాక్స్ పెండింగ్ ఉన్న బడా భవనాల నిర్వాహకులకు రెడ్ నోటీసులు జారీ ప్రారంభించారు.

అర్ధ సంవత్సరానికి వసూలు కావాల్సింది రూ. 32 కోట్లు

ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలోని భవనాలు, నిర్మాణాలు, కమర్షియల్ నుంచి ఏడాదిలో రెండు పర్యాయాలుగా ట్యాక్స్ వసూళ్ల చేస్తారు. సెప్టెంబరు 30 నాటికి అర్ధ సంవత్సరం ట్యాక్స్ వసూళ్ల జరగాల్సి ఉంది. కానీ సెప్టెంబరు 1న మున్నేరుకు వరద పోటు రావటం తర్వాత రెవెన్యూ విభాగం సిబ్బంది ముంపు ప్రాంత విధులకు నియమించారు. దీంతో ఆరు నెలల కాలానికి కేఎంసీలో వసూళ్ల కావాల్సిన రూ. 32 కోట్ల ఆదాయానికి ఆర్థిక గండి పడింది. గత ఐదు నెలల 20రోజుల్లో ఇప్పటి వరకు రూ.12.46 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చింది. ఇంకా రూ.18.56 కోట్లు వసూళ్ల జరగాల్సి ఉంది. వాస్తవానికి సెప్టెంబరు మాసంలోనే అత్యదిక ట్యాక్స్ వసూళ్ల ఉంటుంది. ఆరు నెలల కాలానికి చివరి మాసం కావటంతో ప్రత్యేకంగా డ్రైవ్ పెట్టి ట్యాక్స్ వసూళ్ల చేస్తే రూ.1.5 కోట్లు వసూళ్ల జరిగేవి. కాని కేవలం రూ.12 లక్షలు మాత్రమే ఆన్‌లైన్ విధానంలో సీడీఎంఏ ఖాతాలకు చేరాయి.

2,500 కమర్షియల్ భవనాలకు నోటీసులు

ఖమ్మం నగరపాలక సంస్థ పరిదిలో 8,300 వరకు కమర్షియాల్ భవనాలు ఉన్నాయి. భవనం విస్తీర్ణంను బట్టి ఏడాదికి రూ.50వేల నుంచి రూ. 3లక్షలు వరకు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఆరు నెలలకు గాను బడా భవనాలకు రూ.1.5 లక్షల వరకు ట్యాక్స్ కలెక్షన్ చెల్లించాల్సి ఉంది. కేఎంసీ పరిదిలో చాలా కాలంగా 2,500 కమర్షియల్ భవనాలు ట్యాక్స్ చెల్లించడం లేదు. దీంతో పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్ వసూళ్లకు రెడ్ నోటీసులు సోమవారం జారీ ప్రారంభించారు.

నోటీసులు అందుకున్న తర్వాత భవన నిర్వాహకులు వారం రోజుల్లోనే బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. రెడ్ నోటీసులను బిల్ కలెక్టర్లు నేరుగా అందిస్తున్నారు. రెడ్ నోటీసులు ద్వారా రూ. 2కోట్ల ఆదాయం రాబట్టేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలిచ్చారు. ఇక సాదారణ భవనాల యజమానులకు 40వేల ఎస్ఎంఎస్‌లను పంపుతున్నారు.

30వరకు స్పెషల్ డ్రైవ్

జి. శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి, కేఎంసీ



పన్ను వసూళ్లకు ఈనెల 30 వరకు తుది గడువు ఉంది. ప్రత్యేక డ్రైవ్ పెట్టి ట్యాక్స్ వసూళ్ల చేస్తాం. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న కమర్షియల్ భవనాలకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. సాదారణ భవనాలకు ఎస్ఎంఎస్‌ల ద్వారా బకాయిలు ఉన్న వారికి సమాచారం అందించాం. 30వరకు రెవెన్యూ సిబ్బందిని ట్యాక్స్ వసూళ్లకు వినియోగిస్తాం.

శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

» క్రీడల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి » కలెక్టర్ జితేష్ వీ పాటిల్ » విద్యార్థులతో కలిసి స్వచ్ఛత హీ సేవా



శనివారం స్వచ్ఛత హీ సేవాలో పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 22: ఎంతోమంది విద్యార్థులను మేధావులు, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దిన కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనాదరణకు గురికావడంతో కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రతతో దర్శనమిస్తుంది. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అసాంఘీక కార్యకలపాలు కొనసాగిస్తున్నారు. పూర్వ భవన తరగతి గదులు శిథిలావస్థలో ఉండి నిరుపయోగంగా పడి ఉన్నాయి. విశాలమైన స్థలం ఉన్నా పరిరక్షణ లేకపోవడంతో అన్యాక్రాంతానికి గురవుతుంది. ఇదిలా ఉండగా డిగ్రీ కళాశాలను భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇటీవల సందర్శించారు. కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా అడుగులు సాగించారు. ఇంకేముంది జిల్లాలో ఈనెల 17నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన క్రీడలు, జిల్లాగ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలసి పిచ్చి మొక్కలను తొలగించారు.

కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామచంద్ర ప్రభుత్వ కళాశాల ఆవరణలో క్రీడాకారులకు కావల్సిన విశాలమైన స్థలం ఉందన్నారు. కలెక్టర్ నిధులను నుంచి రన్నింగ్‌ట్రాక్, హాకీకోర్టు, వాలీబాల్‌కోర్టు, స్విమ్మింగ్ పూల్ తదితర క్రీడలకు సంబంధించిన సదుపాయాలను సమకూర్చుతూ క్రీడల అభివృద్ధికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కళాశాల పూర్వ విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, ప్రస్తుత విద్యార్థుల సమష్టి కృషితో క్రీడాకారులకు మరింత సౌకర్యవంతంగా తయారు చేద్దామన్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించడంతో విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్‌తో పాటు పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే పేరుగాంచిన శ్రీరామచంద్రకళాశాలకు తిరిగి పూర్వ వైభవం చేకూరనుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు

బోనకల్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన మధులత, ఆకాంక్ష

బోనకల్, సెప్టెంబరు 22: హర్యానా రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న 43వ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ గురుకుల పాఠశాలలో చదువు తున్న ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 14, 15 తేదీలలో హైదరాబాద్ లో జరిగిన 43వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఖమ్మం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీలలో అత్యుత్తమ క్రీడా ప్రతిభ చాటిన కె. మధులత, కె. ఆకాంక్ష జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అధ్యక్షుడు వి. సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కోచ్ అమరేసి లింగయ్య హర్షం వ్యక్తం చేశారు.

క్షత్రియ సేవా సంఘం జిల్లా కార్యదర్శిగా సోమరాజు



సోమరాజు

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబరు 22: భద్రాద్రి జిల్లా క్షత్రియ సేవా సంఘం బుద్ధం కమిటీ కార్యదర్శిగా కునదరాజు సోమరాజును ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీశైలంలోని అల్లూరి సీతారామ రాజు నిలయం నందు జరిగిన సంఘం సమావేశంలో సోమరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 23 ఏళ్లుగా కొత్తగూడెం జిల్లా క్షత్రియ సేవా సమితి జనరల్ సెక్రటరీగా విధులు నిర్వహించిన ఆయన సేవలను గుర్తించి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. సోమరాజు మాట్లాడుతూ క్షత్రియ సేవా సమితికి చేసిన సేవలను గుర్తించి నాకు ఈ పదవిని ఇచ్చినందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల క్షత్రియ సేవా సమితి సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న మరమ్మతులు

(5వ పేజీ తరువాయి)

వెంటనే ఇక్కడ జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఒకట్రెండు రోజుల్లో నీరు ఇవ్వకపోతే రైతుల బలవన్మరణాలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, జిల్లా కార్యదర్శి హట్యనాయక్,గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు బండి రమేష్, మాదినేని రమేష్, షన్మతిరావు, రాజు, రమణారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావు, మండల పార్టీ నాయకులు, రైతుసంఘ నాయకులు సందర్శించారు. ఆమ్ ఆద్మీ తెలంగాణ కోర్‌కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమల్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వర్ణసుబ్బారావు, పలువురు నాయకులు పరిశీలించారు.

పీడీఎస్‌యూ పోరాటాలు చరిత్రాత్మకమైనవి..

(5వ పేజీ తరువాయి)



హాజరైన నాయకులు

వచ్చిదంటే దాని వెనుక పీడీఎస్‌యూ 50ఏళ్ల ఉద్యమ పోరాటాలు ఉన్నాయన్నారు. సమాజంలో వచ్చిన మార్పులతో రాజకీయ పార్టీలు మతోన్మాద రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని వాటిని నిర్మూలించేందుకు ప్రస్తుతం సమాజంలో వివిధ రూపాల్లో ఉన్న పూర్వ పీడీఎస్‌యూ నాయకులు స్వర్ణోత్సవ వేడుకల స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యా వ్యవస్థ అమలు తీరుపై సమీక్ష చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకోసమే నెల 30న హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కొండా నాగేశ్వరరావు, పురుషోత్తం పీడీఎస్‌యూ పూర్వ బాధ్యులు మనోహర్‌రాజు, రమేశ్, తిరుమలరావు, ఎం పుల్లయ్య, రామచంద్రరావు, వై నాగేశ్వరరావు, పి. నాగేశ్వరరావు, విజయ్‌నాగిరెడ్డి, రామారావు, నరేందర్, గుర్రం అచ్చయ్య, నరేందర్ తదితరులు సభలో ప్రసంగించారు.

బ్యాంకులో రుణదందా

అశ్వారావుపేట, సెప్టెంబర్ 22: అశ్వారావుపేట మండలం వినాయకపురంలో గల యూనియన్ బ్యాంకులో రుణాలు, ఇతర స్కీమ్‌ల పేరిట రూ.2కోట్ల మేర దందా జరిగినట్లు తెలుస్తోంది. ఈ బ్యాంకులో పనిచేసే మేనేజర్... ఓ ప్రైవేటు వ్యక్తితో కుమ్మక్కై ఈ పని చేసినట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు సదరు మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బ్యాంకుల్లో సులువుగా, వేగంగా సేవలు అందించేందుకు ఆయా బ్యాంకులు తమకు అనుబంధంగా కో-ఆర్డినేటర్‌లను నియమించుకుంటున్నాయి. అందులో భాగంగా వినాయకపురంలోని ఓ జాతీయ బ్యాంకు వారు నియమించుకున్న ఓ కో-ఆర్డినేటర్‌కు చెందిన బంధువు అంతా తానై బ్యాంకులో పెత్తనం చెలాయించినట్లు సమాచారం. సదరు ప్రైవేటు వ్యక్తితో బ్యాంక్ మేనేజర్ కుమ్మక్కై కోట్ల రూపాయల రుణాలను ఇష్టానుసారంగా మంజూరు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నిరుద్యోగులు, చిరు వ్యాపారులు, పంట రుణాలు లేని రైతులను గుర్తించి బ్యాంకుల ద్వారా అందించే ముద్ర, పీఎం ఈజీపీ, పంట రుణాలను ఆయా వర్గాలకు చెందిన లబ్ధిదారులకు వలవేసి రుణాలు ఇప్పించారు. రుణాలు అవసరం లేనివారికి కూడా రుణాలు మంజూరు చేయించి వారికి గుడ్‌విల్ కింద కొంత సొమ్ము ను ఇచ్చి మిగిలిన సొమ్మంతా వారే తీసుకున్నారు. ఆ సొమ్మును వాయిదాల ప్రకారం సదరు వ్యక్తులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

సొమ్ము కావలసిన లబ్ధిదారులకు సగం సొమ్ము ఇచ్చి మిగిలినది వీరు తీసుకునేలా ఒప్పందంతో రుణాలు ఇప్పించారు. పీఎంఈజీపీ వంటి పథకాల్లో అర్హతలేని వారిని చేర్పించి వచ్చిన సొమ్ములో వాటా తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారమంతా సదరు బ్యాంకు మేనేజర్ కనుసన్నలలోనే జరిగిందని, ఈ వ్యవహారంలో ఆయనకు కూడా కొంత సొమ్ము అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు లబ్ధిదారులు సకాలంలో వాయిదాలు చెల్లించినా అవి వారి ఖాతాలకు చేరకపోవడంతో వారు సదరు ప్రైవేటు వ్యక్తిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

రైతు రుణమాఫీ సొమ్ము కూడా...

రైతు రుణమాఫీ పథకం నుంచి కూడా సదరు వ్యక్తులు భారీగా లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. కొంతమంది గిరిజనులు తమ ఖాతాల్లో నుంచి నగదును విత్‌డ్రా చేసుకునే సమయంలో వేలి ముద్రలు వేయించుకొని వారికి తెలియకుండానే వారిపేరున రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారందరికీ రుణమాఫీ వచ్చినట్లు మెసేజ్‌లు రావడంతో ఈ వ్యవహా రం వెలుగులోకి వచ్చింది. మెసేజ్‌లు వచ్చిన కొందరు రైతులు... అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. గతంలో బ్యాంకు ద్వారా వచ్చే ఇన్సూరెన్స్, ఇతర స్కీమ్‌ల లో అనర్హుల పేర్లతో చేర్పించి భారీగా సొమ్ము కాజేసారనే ఆరోపణలూ ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో సుమా రు రూ. రెండు కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది.

బాధితులు ఒక్కొక్కరుగా బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దాంతో స్పందించిన ఉన్నతాధికారులు తక్షణమే సదరు బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో మరో మేనేజర్‌ను నియమించారు. ఈ మొత్తం ఫిర్యాదులపై గోప్యంగా విచారణ చేస్తున్నారు. ఈ లావాదేవీలకు సంబంధించి కొంత సొమ్ము సదరు బ్యాంకు మేనేజర్ బంధువుల ఖాతాల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై ప్రస్తుత మేనేజర్‌ను వివరణ కోరగా బ్యాంకు రుణాల దుర్వినియోగంపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ జరుగుతోందన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థకు దీటుగా మారుమూల పల్లెలకు సైతం ప్రజలకు ప్రయాణ సేవలు అందిస్తున్న ఆటో,క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై ఉందని, ఆ బాధ్యతను విస్మరించిపన్నులు, ఫైన్ల పేరుతో కార్మికులను దోచుకునేపనిలో పాలకులు ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్ అండ్ ప్రైవేట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభలు కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు కార్మికులు ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ జాతీయ నాయకులు వీఎస్ బోస్ జెండాను ఎగురవేసి మహాసభలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రవాణారంగ కార్మికులను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, రోడ్డు, సేఫ్టీ చట్టాలు, అపరాధ రుసుము, పన్నుల పేరుతో కార్మికుల జేబులు కొల్లగొడుతూ ఖజానా నింపుకుంటోందని విమర్శించారు. పెట్రోల్, డిజిల్ ధరలను విపరీతంగా పెంచి కార్మికులపై భారం మోపుతున్నారని అన్ని వసతులపై .జీఎస్టీ విధిస్తున్న కేంద్ర పెట్రోల్, డిజీల్‌పై ఎందుకు జీఎస్టీ విధించారో సమాధానం చెప్పాలని, ఈ విధానం ఇంధన కంపెనీలకు మేలుచేసేందుకేనని విమర్శించారు. ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతి నెల రూ.12వేల ఆర్థిక అందించి ఆదుకోవాలని, బీమాను రూ.10లక్షలకు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రవాణా రంగ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వీఎస్ బోస్, ఎస్. బాలరాజు, కంచర్ల జమలయ్య, బి. వెంకటేష్, నరాటి ప్రసాద్ సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ, సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పెరబోయిన మోహన్‌రావు, దేవరకొండ శంకర్, వి. పూర్ణచందర్‌రావు, జి. రామకృష్ణ, భూక్య దస్రు, కందుల భాస్కర్, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

» కొత్తగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారాం ఏచూరి చేసిన సేవలకు ముగింపు లేదని మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి. మధు అన్నారు. కొత్తగూడెంలోని కమ్మకళ్యాణ మండపంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఏచూరి చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకుడు కాసాని అయిలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత సీతారాం ఏచూరి బెంగాల్ కేంద్రంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు ఏర్పాటు చేసి.. కష్టజీవులు, కార్మికులు ఉన్నంత కాలం కమ్యూనిజానికి, సోషలిజానికి మరణం లేదని చాటిచెప్పారని గుర్తు చేశారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి భరోసా ఇచ్చే పద్ధతిలో ఏచూరి అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అనేక రకాల సమస్యలపై ఇతర రాజకీయ పార్టీలు సైతం అంగీకరించే విధంగా ఏచూరి తన వాదనలను వినిపించేవారని, విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు రాజకీయాల్లోకి వచ్చిన ఏచూరి తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పని చేశారని నివాళులర్పించారు. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతున్న సందర్భంలో ఏచూరి వేగుచుక్కలా ముందుకు నడిపించడంలో తీవ్రమైన కృషి చేశారని తెలిపారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఏచూరి మరణం భారతదేశానికి వామపక్ష, రాజకీయాలకు తీరని లోటని అన్నారు. తన మేదస్సుతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సైద్ధాంతికంగా నిలపెట్టిన ధీరుడు అని కొనియాడారు. కమ్యూనిస్టులు ఐక్యమై పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ కష్టజీవుల రాజ్యాన్ని సాధించడమే ఏచూరికి అందించే ఘనమైన నివాళి అన్నారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు బి. వెంకట్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమమే కాదు భారతదేశమే ఒక గొప్ప రత్నాన్ని కోల్పోయిందని అన్నారు. భారత రాజ్యాంగమూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజంపై దాడి జరుగుతున్న తరుణంలో లౌకిక భావాలకు కట్టుబడి పని చేసిన ఏచూరి లేకపోవడం తీరని లోటన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్గివర్గ సభ్యుడు మధు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కోనేరు సత్యనారాయణ (చిన్ని), బీఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, టీజేఎస్ జిల్లా నాయకులు మల్లెల రామనాథం, పట్టణ ప్రముఖుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు, ప్రముఖ కవి మండవ సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వీరభద్రం, వివేకవర్ధిని విద్యాసంస్థల చైర్మన్ ఎంవీ. చౌదరి, వైద్యులు రమేష్‌బాబు, రాంమోహన్‌రావు, ఐలు రాష్ట్ర నాయకులు జె.శివరాం ప్రసాద్, రమేష్‌కుమార్ మక్కడ్, సీపీఎం నేతలు బుగ్గవీటి సరళ, కాసాని అయిలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, రమేష్, ఎం.జ్యోతి, లిక్కి బాలరాజు, నర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కె. బ్రహ్మచారి, కారం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందేనా!

కూసుమంచిలో 28వేల ఎకరాల్లో, మధిరలో 12,970 ఎకరాల్లో పంట నష్టం



కూసుమంచి మండలం జుజ్జులరావుపేట సమీపంలో ఎడారిని తలపిస్తున్న వరిపొలాలు

- వరదల ధాటికి చెదిరిపోయిన పంట పొలాల హద్దులు
- నేటికీ రైతులకు అందని పరిహారం
- సర్వేలకే పరిమితమైన పంట నష్టం వివరాలు

కూసుమంచి, సెప్టెంబరు 22: ఆగస్టు 31 రాత్రి కురిసిన భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో చెరువులు, కుంటలు తెగిపోయి.. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాలేరు వాగునుంచి, పరీవాహక ప్రాంతాల్లో ఎగువ నుంచి పాలేరు జలాశయానికి వరద ముంచెత్తింది. దీంతో రాత్రికి రాత్రి పాలేరు జలాశయం 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి 32 అడుగులకు చేరింది. సుమారు 1.97 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో సాగులో ఉన్న వరి పొలాలకు భారీ నష్టం వటిల్లింది. ఈవరద రైతాంగానికి అంతులేని విషాదాన్ని మిగిల్చింది. చాలా చోట్ల ఇసుకమేటలు, రాళ్లతో నిండిన పొలాలు, కొన్ని చోట్ల పం ట భూములు కోతకు గురై, పంట కాల్వలను తలపిస్తున్నాయి. ఇసుక, రాళ్లు కప్పేసిన తమ పొలాలను చూసుకుంటే ఎక్కడ ఎవరి పొలం ఉందో గుర్తుపట్టలేకుండా ఉంది. వాటిని తొలగించుకుని హద్దులు సరిచేసుకుని మళ్లీ పంట భూములుగా యథావిధిగా సాగుకు తీసుకువచ్చేందుకు ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదంటూ రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు.

వరదలు వచ్చిన అనంతరం 20రోజులపాటు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రసాయిలో పరిశీలించారు. పంట నష్టాన్ని లెక్కించారు. 28వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారికంగా గుర్తించారు. కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో అత్యధికంగా నష్టం వాటిల్లింది. ఇంతరవకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం ప్రకటించిన నష్టం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. సర్వేలకే పరిమితమా లేక పరిహారం అందిస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లాడలో నెర్రెలుబారిన పైర్లు

తల్లాడ, సెప్టెంబరు 22: సమృద్ధిగా జలాశయాలు నిండటంతో పంటలు పుష్కలంగా పండుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. సకాలంలో సాగునీరందక పైర్లు నెర్రలు బారుతున్నాయి. వానాకాలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) నిండటంతో పంటలకు పుష్కలంగా సాగునీరందుతుందని ఆశతో ఆయకట్టు పరిధిలోని తల్లాడ మండలంలో 12వేల ఎకరాల్లో వరి, ఆరువేల ఎకరాల్లో మిర్చి సాగుచేశారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి పొట్టదశలో మరికొన్ని గ్రామాల్లో ఎదిగే దశలో ఉంది. మిర్చిపైరు కూడా ఎదిగే దశలో ఉంది. యుద్ధప్రాతిపదికన ఎన్నెస్పీ ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టి తక్షణమే నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



మల్లవరంలో నెర్రెలు బారిన వరిపైరు

మధిరలో 13,695 మంది రైతులకు నష్టం



మధిరలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మధిర: ఇటీవల వచ్చిన వరదల వల్ల మధిర డివిజన్‌లో 13,695మంది రైతులకు పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ నిర్ధారణ చేసింది. 12,970.06 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తుది నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. వరద అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలపై వ్యవసాయశాఖ జిల్లా అధికారి పుల్లయ్యతోపాటు డివిజన్ అధికారులు ఏడీఏ విజయచంద్ర ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో స్వయంగా పంటలను పరిశీలించారు.

మధిర డివిజన్ వ్యాప్తంగా 13,695 మంది రైతులకు చెందిన 12,970.06 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మధిర మండలంలో 4,094 మంది రైతులు, 2,902.16 ఎకరాల్లో, ఎర్రుపాలెం మండలంలో 3,249 మంది రైతులు, 3,262.24 ఎకరాల్లో, ముదిగొండ మండలంలో 3,139మంది రైతులు, 3,843.30 ఎకరాల్లో, బోనకల్ మండలంలో 1,546 మంది రైతులు, 1,308.35 ఎకరాల్లో, చింతకాని మండలంలో 1,667 మంది రైతులు, 1,481.01ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఏడీఏ అధికారులు తుది నివేదికను తయారు చేశారు.

పొలంలో ఇసుక మేట వేసింది



● మాలోతు శ్రీను, సోమ్లాతండ

నేను ఏడెకరాలు పొలం కౌలుకు తీసుకొని సాగు చేశాను. ఇటీవల పాలేరు వాగుకు భారీ వరద పోటెత్తడంతో పదిహేనురోజుల్లో పొట్టకు రావాల్సిన పొలం మొత్తం కొట్టుకపోయి ఇసుక మేటలు వేసింది. పంట పెట్టుబడికి రూ.2లక్షల వరకు పెట్టాను. ఇంటికి చేరాల్సిన పంట దిగుబడి వరదపాలైంది. ఇప్పుడు ఈభూమి సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సాయం కూడా రైతుకే వస్తుందంట. మా కౌలురైతుల పరిస్థితి ఏమిటో తెలియడం లేదు..

జీవనాధారాన్ని కోల్పోవాల్సి వస్తుంది



● మోదుగు భూషణం, రైతు, బస్వాపురం

ఎన్నెస్పీ బస్వాపురం మేజర్ కింద రెండెకరాల్లో వరి సాగుచేశాను. పొట్టదశలో ఉంది. మూడువారాల నుంచి కాల్వలకు నీరు రాకపోవడంతో పొట్టదశలో ఉన్న వరిపైరు ఎండిపోతుంది. రెండెకరాల్లో పంటలు కోల్పోతే మాకు జీవనాధారం లేకుండాపోతుంది. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప వ్యవసాయం చేసుకునే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేక అప్పులపాలు కావల్సి వస్తుంది.

పంట మొత్తం కోతకు గురైంది



● బాదావత్ శంకర్, హట్యతండ

హట్యతండా సమీపంలో మూడెకరాల వరిపొలం ఉంది. సాగర్ ఎడమకాల్వకు గండి పడటంతో వరద నీరంతా పొలంమీదకు పోటెత్తింది. దీంతో వరిపొలం మొత్తం కొట్టుకుపోయి కోతకు గురైంది. పొలం మొత్తం పెద్దకాల్వ ను తలపిస్తోంది. ఇప్పటికీ పొలంలో వరద ప్రవహిస్తూనే ఉంది. పెట్టుబడి కింద సుమారు రూ.75వేల వరకు ఖర్చు చేశాను. అంతేకక ఎకరాకు రెండు లక్షలు ఖర్చు చేసినా కోతకు గురయిన పొలాన్ని బాగుచేయడం కష్టమే.

బోనస్‌పై కార్మికుల హర్షాతిరేకాలు

» సింగరేణి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడి

కొత్తగూడెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాల్లో 33శాతం వాటా చెల్లించాలని సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.5వేల చొప్పున బోనస్‌గా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్ణయించడం పట్ల సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు హర్షం వెలిబుచ్చుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ రూ.47.01 కోట్ల నికరలాభాలు గడించినట్లు అధికారికంగా సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. వీటిలో 33శాతం లాభాల వాటా ప్రకటించడంతో సింగరేణి సంస్థ రూ.796 కోట్లుచెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా ఒక్కొక్క కార్మికుడికి వారి మూలవేతనం, సర్వీసును బట్టి రూ.1.90లక్షల మేరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఈ లాభాల వాటాను దసరా పండుగ కల్లా సింగరేణి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు వారి వారి బ్యాంకు ఖాతాల్లో సింగరేణి యాజమాన్యం జమచేయనుంది. ఈ సందర్భంగా కార్మికుల మనోగతం వారి మాటల్లోనే...

బోనస్ ప్రకటించడం ఆనందంగా ఉంది...



● బంధం నాగయ్య,

సివిల్ డిపార్టు కాంట్రాక్టు కార్మికుడు (ఇల్లెందు)

అనేక ఉద్యమాల వల్ల నేడు ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో ప్రస్తుతానికి రూ.5వేలు బోనస్‌ను ప్రకటించడం ఆనందించతగిన విషయమన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో, లాభాల్లో భాగస్వాములుగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. గతంలో 18రోజులపాటు సమ్మె చేశామని, ఏఐటీయూసీ కృషి వల్ల మాకు గుర్తింపు వచ్చిందన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు బోనస్ హర్షణీయం



● కొండపల్లి శ్రీనివాస్,

రైల్వేసైడింగ్ కాంట్రాక్టు కార్మికుడు (ఇల్లెందు)

ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తొలిసారిగా సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించడం హర్షణీయ. అనేకసార్లుగా సాధించిన పోరాటాలతో బోనస్ సాధించుకున్నామని అయితే ఎలాంటి ఆంక్షలు లేకుండ సింగరేణిలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలన్నారు. సింగరేణిలో ఉద్యమాలతోనే గతంలో సీఎంపీఎఫ్ సాధించుకున్నామని నేడు లాభాల్లో వాటా సాధించామన్నారు.

సంస్థ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం



● తోట స్వాతి, బదిలీ వర్కర్ (కొత్తగూడెం)

సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులు, అధికారుల సంక్షేమంతోపాటు సంస్థ సమగ్రాబివృద్దే ద్యేయంగా అభివృద్ధిపథంలో నడిపిస్తున్న యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు. ప్రభుత్వం స్వరాష్ట్ర సాధన కోసం శక్తి వంచన లేకుండ కృషి చేసిన సింగరేణి కార్మికుల పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం లాబాల్లో వాటాను కార్మికులతోపాటు ఒప్పంద కార్మికులకు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఈ లాభాల వాటాతోపాటు దీపావళి బోనస్‌ను కూడా కార్మికులు, ఉద్యోగులు అందుకోనున్నారని, దీంతో కార్మికులు సంస్థ అభివృద్ధి కోసం బాధ్యత పెరిగిందన్నారు.

లాభాల వాటా పంపిణీ హర్షణీయం



నిర్మల, సింగరేణి కార్మికురాలు (కొత్తగూడెం)

సింగరేణి సంస్థ లాభాల్లో వాటాను ఉద్యోగులతో పాటు ఒప్పంద కార్మికులకు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. అన్ని కార్మికసంఘాల యూనియన్ నాయకుల కృషి వల్ల లాభాల వాటాను ఒప్పంద కార్మికులకు పంపిణీ చేశారని ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి సహకరించిన అన్ని కార్మికసంఘ యూనియన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'భారతదేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి'



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం

మధిర, సెప్టెంబరు 22: భారతదేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీవీఎం స్కూల్‌లో సీపీఎం పార్టీ నాయకులు శీలం నర్సింహారావు ఆధ్వర్యం లో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భం గా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ నిష్కలంక మార్కిస్టు మహామేధావి అని ఆయన గొప్ప ప్రజాబంధు, ఆదర్శకామ్రేడ్‌గా కొనియాడారు. దశాబ్దాల కాలంపాటు ప్రజల కోసం పని చేశారన్నారు. ఆయన లేని లోటు దేశరాజకీయాల్లో తీర్చలేనిదని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ ఉద్యమాల సూరీడు అని జీవితమే కాకుండా ఆయన దేహాన్ని సైతం దేశానికి అర్పించిన ఆదర్శనేత సీతారాం ఏచూరి అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, సీపీఐ నాయకులు బెజవాడ రవి, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావులు మాట్లాడుతూ స్నేహం, సిద్ధాంతం, సహజత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగిన అభ్యుదయ నేతన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

బూత్ స్థాయిల్లో బీజేపీని బలోపేతం చేయాలి

» బీజేపీ పార్లమెంట్ కంటెస్ట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



గ్రామస్థులతో మాట్లాడుతున్న వినోద్‌రావు

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 22: ప్రతి బూత్ స్థాయిలో విస్తృతంగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించి, బీజేపీని బలోపేతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ కంటెస్ట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని పలువార్డుల్లో పర్యటించి తానే స్వయంగా సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పిలుపు మేరకు కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రతి బూత్ స్థాయిలో పార్టీ ప్రాథమిక సభ్యత్వాలను భారీ స్థాయిలో నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుడగం రవి, డీ. రాజు, క్రాంతికుమార్, వంశీ, వీరన్న, ప్రతాప్, కాలువ సుధాకర్, ప్రసాద్, రామానాయుడు, రహీం, బాలు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 22: సెల్‌ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మేదర బజార్‌కు చెందిన కొన శ్రీనివాసరావు కుమార్తె త్రిషలక్ష్మి(17) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఇంట్లో చదవకుండా సెల్ ఫోన్ చూస్తూ ఉంటుండడంతో తల్లిదండ్రులు చదువుకోవాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సదరు విద్యార్థిని ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు22: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీదేవిపల్లితండాకు చెందిన మూడ్ నాగేశ్వరరావు(33) తనకున్న కొద్దిపాటి భూమితో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. ఇటీవల బోలేరో వ్యాన్‌ను కూడా ఫైనాన్స్‌పై తీసుకున్నాడు. గత రెండేళ్ల నుంచి పంటలు పండక అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో భార్యభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కాగా భార్య మందలించడంతో ఈనెల 19న క్రిమిసంహారక మందు తాగాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. ఈమేరకు మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

బిల్డింగ్‌పై నుంచి పడి తాపీమేస్త్రి....

దమ్మపేట, సెప్టెంబరు22: బిల్డింగ్ పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తాపీమేస్త్రి మృతి చెందిన ఘటన రాసూరుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... రాసూరుపల్లి గ్రామంలో చర్చి బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. అదే గ్రామానికి చెందిన తాపీమేస్త్రి సోయం జానీ (47) చర్చి నిర్మాణపనులు చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పై నుంచి కిందకు పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చికిత్స నిమిత్తం సత్తుపల్లి వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు.

నాచేపల్లి సొసైటీ సీఈవో ...



కోటయ్య(ఫైల్)

నేలకొండపల్లి, సెప్టెంబరు22: మండల పరిధిలోని నాచేపల్లి సహకార సంఘం సీఈవో సత్యాల కోటయ్య(56) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతడిని చికి త్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. అంత్యక్రియల నిమిత్తం నా చేపల్లి సొసైటీ నుంచి అధ్యక్షుడు సత్యనారాయణ మృతుని కుటుంబానికి రూ.15వేలను అందచేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్, పైనంపల్లి సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీల అధ్యక్షులు అనంతు కాశయ్య, తోట వెంకటరావు, గూడవల్లి రాంబ్రహ్మం, ధీరావత్ బాలాజీ, వందనపు నాగేశ్వరరావు, డీసీసీబీ సీఈవో వసంతరావు, సీఈఓలు ఐనాల నాగేశ్వరరావు, బొంత వీరబాబు, జగదీష్, రామకోటయ్య, పరమేశ్వరరావు, నాయకులు వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఉన్నం బ్రహ్మయ్యలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్...

ఎర్రుపాలెం, సెప్టెంబరు22: మండల కేంద్రం ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నంద్రు వెంకటరత్నం(43) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గత కొద్దిరోజుల క్రితం కార్యాలయంలో విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యానికి గురయ్యాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. తహసీల్దార్ ఉషాశారద భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరుపున రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందించారు. పలువురు రాజకీయనాయకులు రెవెన్యూ సిబ్బంది వెంకటరత్నం కుటుంబానికి సానుభూతి తెలిపారు.

కొత్తగూడేనికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్

» ప్రారంభించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

» సందడి చేసిన సినీ తారలు పాయల్‌రాజ్‌పుత్, నేహాశెట్టి



ఉమెన్స్ కలెక్షన్స్‌ను ప్రదర్శిస్తున్న తారలు నేహాశెట్టి, పాయల్‌రాజ్ పుత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి, సెప్టెంబరు22: సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తన 36వ షో రూమ్‌ను భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం విద్యానగర్‌లో ఆదివారం ప్రారం భించారు. కార్పోరేట్ స్థాయిలో వస్త్ర వ్యాపారాలను, అన్ని రకాల వస్త్రాలను, చుట్టు ప్రక్కన ప్రాంతాల ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం స్పష్టం చేశారు. ఈ షాపింగ్ మాల్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సినీ హీరోయిన్లు మంగళవారం ఫేమ్ పాయల్‌రాజ్‌పుత్, డిజే టిల్లూ ఫేమ్, నేహాశెట్టి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వయస్సుల, తరాల అభిరుచులకు సరితూగే విస్తృత శ్రేణికి చెందిన దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. వస్త్ర ప్రియులు ఈ షాపింగ్ మాల్‌ను తప్పక సందర్శించి, సరికొత్త అభిరుచులకు సరిపడే వస్త్ర శ్రేణిని పొందాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం దినదిన అభివృద్ధి చెందుతుం దన్నారు. అన్ని వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతంగా కొత్తగూడెం పేరు ప్రఖ్యాత లు తెచ్చుకుందన్నారు. రాబోయే రోజుల్లో మరెన్నో కార్పొరేట్ కంపెనీలకు స్వాగతం పలుకుతున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో సినీ తారలను చూసేందుకు ప్రేక్షకులు, ప్రజలు తరలివచ్చారు. షాపింగ్ మాల్‌లో ఉన్న మెన్స్, ఉమెన్స్ వివిధ కలెక్షన్స్‌ను సినీ తారలు ప్రదర్శించి వారి అభిరుచు లను పంచుకున్నారు. అనంతరం వారు నటించిన సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు రాజమౌళీ, సురేష్‌శీర్ల, అభినయ్, రాకేష్, కేశవ్, మేనేజర్ అనిల్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ సీతా లక్ష్మీ, మార్కెటింగ్ ప్రతినిధులు శ్రీధర్, శ్రీకాంత్, శీరాజ్, కొత్తగూడెం డీఎస్పీ రెహ మాన్, నాయకులు నాగా సీతారాములు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, బాదావత్ శాంతి, వాసిరెడ్డి మురళీ, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై భౌతిక దాడి

● విషమంగా బాలిక పరిస్థితి

భద్రాచలం, సెప్టెంబరు 22: భద్రాచలంలోని ఆదర్శనగర్ కాలనీలో ఓ గిరిజన మైనరు బాలికపై మనోజ్ అనే యువకుడు భౌతిక దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 20న ఆదర్శనగర్‌లో నివాసముంటున్న బాలిక తన స్నేహితురాలితో కలిసి సమీపంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు చూసేందుకు వచ్చింది. ఈ సమయంలో ఆ బాలికతో వచ్చిన స్నేహితురాలు తన అన్నను చూసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. కాగా మా చెల్లిని ఎందుకు తీసుకొచ్చావు అని అతడు సదరు బాలికపై భౌతిక దాడి చేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో బాలికను కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఈ విషయంపై బాలిక తల్లి చిలకల లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు జూడో జిల్లా జట్ల ఎంపికలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు22: హన్మకొండలో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్ల ఎంపికలు సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99512 74678 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతులకు పరిహారం అందించాలి

● మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, సెప్టెంబరు 22: సాగర్ కాల్వపై పడిన గండ్లను సకాలంలో పూడ్చి సాగునీరు అందించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్న ప్రణాళిక బద్ధంగా గండ్లు పూడ్చి పంటలకు సాగునీరు అందించటంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. సాగునీటి ఎద్దడితో ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయుకట్టు కింద వేలాది ఎకరాల వరి పైరు ఎండి పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీతారామ ప్రాజెక్టును సాగర్ కాల్వకు అనుసంధానం చేసున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్బాలు పలికిందని ఇలాంటి పరిస్థితుల్లో ఆ నీటినైన విడుదల చేసేందుకు కార్యచరణ చేయక పోవటం శోచనీయమని సండ్ర అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నాగార్జున సాగర్‌లో 500 అడుగుల నీరు ఉన్నా కూడా రైతుల పంటలను కాపాడారని చెప్పారు. సాగర్‌లో నీరులేని సమయంలో కాళేశ్వరం నుంచి ఎస్ఆర్ఎస్‌పి, బయన్న వాగు ద్వారా నీటిని పాలేరుకు తరలించి మూడు తడులకు నీరు అందించి రైతులను కేసీఆర్ ఆదుకున్నారని తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న సాగర్ నీరు అందించటంలో వైఫల్యం చెందంటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు అందించిన సరిపడదని, ప్రభుత్వం సర్వే చేసి ఎకరానికి రూ. 25 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

పాలేరు గండిప్రదేశాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

కూసుమంచి: పాలేరు జలాశయం వద్ద ఎడమకాల్వ గండి ప్రదేశాన్ని కాంగ్రెస్ రైతువిభాగం నాయకులు సందర్శించారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలమేరకు పరిశీలించినట్లు కాంగ్రెస్ రైతువిభాగం రాష్ట్ర నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా రైతునాయకులు మొక్క శేఖర్‌గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఐబీ అధికారులతోనూ, కాంట్రాక్టర్‌తోనూ పనుల పురోగతిపై చర్చించినట్లు తెలిపారు. ప్రతిపక్షాల ఆందోళన సరికాదని ఎన్నడూ రాని విపత్తు వచ్చిందని, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగు రాజయ్య, తాతా రఘురాం, పత్తి శ్రీనివాస్ తదితరులున్నారు.

డ్వాక్రా సొమ్ముతో ఉడాయించిన సభ్యురాలు

● పోలీసులకు ఫిర్యాదు ● నేలకొండపల్లిలో ఘటన

నేలకొండపల్లి, సెప్టెంబరు22: రూ.50వేలతో ఉడాయించిన డ్వాక్రా సభ్యురాలిపై గ్రూపు సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. నేలకొండపల్లి ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన 10మంది మహిళలు శ్రీరామా డ్వాక్రా గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. గ్రూపు సభ్యులు నేలకొండపల్లి ఎస్‌బీఐలో పొదుపు ఖాతాను తెరిచారు. ప్రతి నెలా రూ.2వేల చొప్పున నెలకొక సభ్యురాలు, సభ్యుల నుంచి పొదుపు డబ్బులను వసూలు చేసి బ్యాంకులో జమ చేసేలా ఏర్పాటు చేసుకున్నారు. ఈక్రమంలో ఆగస్టు నెలలో పొదుపు సొమ్మును గుగ్గిళ్ళ కృష్ణప్రియ అనే సభ్యురాలు నగదు వసూలు చేసి బ్యాంకులో కట్టాల్సి ఉంది. కృష్ణప్రియ సభ్యుల నుంచి పొదుపు డబ్బును వసూలు చేసి, బ్యాంకులో కట్టకుండానే, కట్టినట్లుగా దొంగ రశీదును తెచ్చి సభ్యులకు చూపి నమ్మించింది. సెప్టెంబరు నెల పొదుపు సొమ్మును జమ చేయటానికి సభ్యులు బ్యాంకుకు వెళ్లగా, బ్యాంకు అధికారులు ఆగస్టు నెల పొదుపు సొమ్ము గురించి ప్రశ్నించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సభ్యురాలు కృష్ణప్రియ రూ.50వేలు కట్టకుండానే కట్టినట్లు నమ్మించి, గ్రూపు సభ్యలను మోసం చేసిందని, ఆమెపై తగు చర్య తీసుకుని న్యాయం చేయాలని శ్రీరామా డ్వాక్రాగ్రూపు సభ్యులు నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పెంటరి సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భద్రాచలం ముఖ్య అర్చకుడికి గాయాలు




చికిత్స పొందుతున్న మదన్‌గోపాలాచార్యులు

భద్రాచలం, సెప్టెంబరు 22: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముఖ్య అర్చకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలం నుంచి పర్ణశాల రామాలయానికి విధి నిర్వహణ కోసం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో చింతలగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆయనను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● వ్యక్తికి గాయాలు

దమ్మపేట, సెప్టెంబరు22: సతుపల్లి బస్‌డిపోకు చెందిన పల్లెవెలుగు బస్ ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తి గాయపడిన ఘటన మందలపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రరాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన కొండపల్లి శివరామ చైత న్య హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై వైజాగ్ వెళుతున్నాడు. మందలపల్లి గ్రామ సమీపంలో అశ్వారావుపేటను నుంచి సత్తుపల్లి వెళుతున్న బస్సు అదపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో చైతన్య గాయపడగా, స్థానికులు అతడిని వైద్యశాలకు తరలించారు.



క్రమశిక్షణ చదువు ఉన్నత స్థానంలో నిలుపుతుంది: డీఎస్పీ

మణుగూరు, సెప్టెంబరు 22: ఉన్నత విద్యను క్రమశిక్షణతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తూ ఉన్నత స్థానాల్లో విద్యార్థులు నిలుస్తారని మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మణుగూరు పట్టణంలోని స్నేహా గార్డెన్స్‌లో శ్రీవిద్య కృష్ణవేణి జూనియర్ కాలేజి ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం నిర్వహించగా మణుగూరు డీఎస్పీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. విద్యార్థులు ఇంటర్ దశ ఎంతో కీలకం అన్నారు. ఇంటర్ ఆ తర్వాత డిగ్రీ ఇతర ఉన్నత విద్యల్లో మంచిగా చదువుకోని రాణించాలని మంచి ఉద్యోగ అవకాశాలను పొంది కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షిచారు. చెడు స్నేహాలు, వ్యసనాల జోలికి వెల్ల కుండా పట్టుదలతో క్రమ శిక్షణతో చదువుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో, డివిజన్ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శంకర్, సారంగపాణి, నాగేశ్వరరావు, బద్దం శ్రీనివాసరెడ్డి, నూకారపు రమేష్, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందుకు సాగని నిర్మాణాలు

నిధులు మంజూరై ఏడాది గడిచినా..

అసంపూర్తిగా నిర్మాణ పనులు

బిల్లుల చెల్లింపులో జాప్యం.. ముందుకు రాని కాంట్రాక్టర్లు

జూలూరుపాడు, సెప్టెంబరు 22: గ్రామాలలో పంచాయతీ కార్యలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్యలయాలను నిర్వహిస్తూ ప్రజలకు సేవలను అందించటానికి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను తొలగించి ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పంచాయతీ కార్యలయాల భవన నిర్మాణాలకు నిధులను కేటాయించింది. జూలూరుపాడు మండలంలో 24 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొత్తగా 12 పంచాయతీలు ఏర్పడగా 11 వాటికి సొంత భవనాలు లేవు. దీంతో సరైన వసతి లేకపోవటంతో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కార్యకలాపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 11 భవనాల నిర్మాణాలకు 2.20 కోట్ల నిధులను మంజూరు చేసింది.

అసంపూర్తిగానే నిర్మాణాలు

మండలంలోని కొత్తూరు, గుండ్లరేవు, బోజ్యాతండా, చింతలతండా, గురవాగుతండా, శంభూనిగూడెం, గాంధీనగర్, నల్లబండబోడు, వెంగన్నపాలెం, సాయిరాంతండా, సూరారం తదితర పంచాయతీలలో భవనాల నిర్మాణాలకు నిధులను ఏడాది క్రితం కేటాయించింది. వీటి



బేస్‌మట్టం స్థాయిలో నిలిచిన నిర్మాణం

నిర్వహణ బాద్యతలను పంచాయతీ రాజ్, ఐటిడిఏకు అప్పగించింది. కాగా ఇప్పటి వరకు కొత్తూరు, గుండ్లరేవు, కార్యలయాల భవన నిర్మాణ పనులు తుది దశలో నిలిచిపోయాయి. బోజ్యాతండా, గురవాగుతండాలలో కార్యలయాల నిర్మాణానికి ఇంకా స్థలాలు దొరకలేదు. గాంధీనగర్‌లో పాఠశాల ఆవరణలో స్థలాన్ని కేటాయంచడం వివాదం నెలకొంది. వెంగన్నపాలెం, చింతలతండా, సాయిరాంతండా, సూరారం పంచాయతీలలో స్థలాలు దొరికిన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. శంభూనిగూడెంలో స్లాబ్ పూర్తయ్యి నల్లబొండబోడులో బేస్ మట్టం స్థాయిలో నిర్మాణాలు నిలిచిపోయాయి.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో నిర్మాణాలను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావటం లేదు. పంచాయతీరాజ్ వారి పర్యవేక్షణలో చేపట్టే భవన నిర్మాణాలకు ఈజీఎస్ ద్వారా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఐటిడిఏ ద్వారా చేపట్టే భవన నిర్మాణాలకు బిల్లులు మంజూరి కాకపోవటంతో పనులు ఆశించిన స్థాయిలో సాగటం లేదు. రెండు చోట్ల భవనాలు తుది దశకు చేరుకున్నప్పటికి సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవటంతో వారు అర్థాంతరంగా పనులను నిలిపివేశారు. ఎప్పుడు ఈ భవనాలు పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అసంపూర్తి భవనాలతో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

బిల్లులు చెల్లించకపోవటంతోనే..

తులసీరాం(ఎంపీవో)

బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో కార్యాలయాల భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. త్వరలోనే నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

రైజ్ గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభం



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంట ర్, సెప్టెంబరు 22: కొత్తగూడెంలో రైజ్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెం ట్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు ఆదివారం ప్రారంభిం చారు. జిల్లా కేంద్రంలో అతి పెద్ద ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్టమర్ దేవుళ్లకు రుచికరమైన ఆహార పదార్థాలను అందజేసి వారి మన్నలను పొందాలని సూచిం చారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని సరసమైన ధరలకే అందిస్తూ వారి వ్యాపార లావాదేవీలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్ రావు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, కోనేరు సత్యనారాయణ, రెస్టారెంట్ నిర్వాహకులు అన్వర్ పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు ఎస్ఐ సాయం



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

ములకలపల్లి, సెప్టెంబరు 22: ఇటీవల ములకలపల్లి మండలంలో సీతారాం పురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు పాఠశాల విద్యార్థులతో పాటు ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన విదితమే.... గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5వేల రూ.లు చొప్పున రూ.30వేలు ములకలపల్లి ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని పరామర్శించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన 100కు డైయల్ చేయాలని కోరారు. మానవత్వం చాటుకున్న ఎస్ఐను మండల ప్రజలు అభినందిస్తున్నారు. తనకు వచ్చిన రివార్డుతో కలిపి రూ. 30వేలు విద్యార్థి కుటుబాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

తహసీల్దార్ బదిలీలో గందరగోళం

పినపాక, సెప్టెంబరు 22: పినపాక మండల తహసీల్దార్ బదిలీలో గందరగోళం నెలకొంది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం జిల్లాలోని 7 మండలాల తహశీల్దార్లను బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా పినపాకలో తహశీల్దార్‌గా పని చేస్తున్న తోట సూర్యనారాయణను గుండాల మండలానికి బదిలీ చేశారు. దమ్మపేటలో పని చేస్తున్న చందా నరేష్‌ను పినపాక మండలానికి కేటాయించారు. ఇదిలా ఉండగానే భద్రాచలం ఐటీడీఏలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీఓ)గా విధులు నిర్వహిస్తున్న అద్దంకి నరేష్‌ను పినపాక మండల తహశీల్దార్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడడంతో గందరగోళం నెలకొంది. ఒక్క రోజు గడవకముందే తహశీల్దార్ల నియామకంలో మార్పులు జరగడంపై రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా, లేక రెవెన్యూశాఖలోని ఉద్యోగుల తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలా, మరేదైనా కారణమా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

లాభాల్లో కార్మికులకు వాటా ఇవ్వాలి

అధికారులకు ఇఫ్టూ నేతల వినతి

మణుగూరు, సెప్టెంబరు 22: సింగరేణి లాభాల వాటా కాంట్రాక్టు కార్మికుల చెల్లింపులో ఓబీ కార్మికులు, వాహన డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులకు వర్తింప జేసే విషయంలో యాజమాన్యం స్పష్టత వక్తం చేయాలని ఇఫ్టూ నాయకులు ఆదివారం ఏరియా అధికారులకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నాయకులు నాసర్ పాషా మాట్లాడుతూ... సింగరేణి బొగ్గు ఉత్పత్తి సాధనలో ఓబి పనులు కీలకమన్నారు. అలాగే సంస్థ ఆస్తుల రక్షణలో సెక్యూరిటీ గార్డులు, రవాణా వ్యవస్థలో కన్వీనెన్స్ డ్రైవర్లు కూడా ప్రాదన్యాతకు అర్హులే అన్నారు. వీరికి సంబంధించి లాభాల వాటాలో స్పష్టత యాజమాన్యం పేర్కోనక పోవడం దారుణమన్నారు. వీరికి కూడా తగిన న్యాయం చేసేందుకు యాజమాన్యం చర్యలను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం ఎం వెంగళరావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మంగిలాల్, పూజారి రామారావు, ఎస్.రవి, కిరణ్, షేక్ అసద్, డి అనీల్,బాలు, రమేష్, కిరణ్; విజయ్,రాము, పి రమేష్, ఆర్ రాజు, విశ్వనాదం, ప్రశాంత్, గణేష్, ప్రసాద్, అజ్మీరా పాషా, అజీముద్దీన్, కృష్ణ, గఫర్, రామ్ అవతార్, వెంకటేశ్వర్లు, జయరాం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

33 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు



పూర్వ విద్యార్థులు

భద్రాచలం, సెప్టెంబరు 22: భద్రాచలంలోని కొర్రాజులగుట్ట పాఠశాలలో 1990-91లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 33 ఏళ్ల తరువాత ఆదివారం పట్టణంలోని అక్షయ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమంకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చీకట్ల శరత్‌బాబు, సిద్ధాంతపు వాసు, ఎర్రంశెట్టి పరశురాం, పండా సత్యానంద్, డేగల కిరణ్‌కుమార్, కామెర్ల రవి, కటారి కృష్ణారావు, బర్ల ప్రభాకర్ కడాలి నాగరాజు, కుంచాల సదానందం, కిలిమి రామ్మోహన్‌రెడ్డి, పావని, నాగలక్ష్మి, సత్య అనంతలక్ష్మి, నీలిమ, రాజ్యలక్ష్మి, సూర్యప్రభ, స్వర్ణలత, లలిత, గోవ్వాల కనకదుర్గ, శ్రీ సరస్వతి పాల్గొన్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం

అశ్వాపురం, సెప్టెంబరు 22: మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డిని అశ్వాపురం మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత ఘనంగా సన్మానించారు. డీఎస్పీ జన్మదినాన్ని పురస్కరించుకుని మణుగూరులోని డీఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, గొల్లగూడెం మాజీ సర్పంచ్ పొడియం అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఖదీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన బ్రహ్మయ్య



అశ్వాపురం, సెప్టెంబరు 22: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆదివారం స్పీకర్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు రఘునాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బోనస్ చెల్లింపు కాంగ్రెస్ ఘనతే'

టేకులపల్లి, సెప్టెంబరు 22: సింగరేణిలో లాభాల బోనస్‌ను సింగరేణి ఉద్యోగులు, కార్మికులతో పాటు తొలిసారిగా కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వడం కాంగ్రెస్ ప్రజా పాలనలో భాగంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతే నని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం కోయగూడెం ఓసీలో ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఫిట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక ఏళ్ళుగా కాంట్రాక్టు కార్మికులు సింగరేణిలో పనిచేస్తున్నప్పటికి ఇవ్వరూ గుర్తించలేదన్నారు. ఇప్పుడు ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించిందన్నారు. కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ అనుబంధ యూనియన్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ కోరిక మేరకు కాంట్రాక్టు కార్మికులు సుమారు 25వేల మందికి ఒక్కొక్కరికి రూ5వేలు బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎమ్మెల్యే కోరం కనకయ్యను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కేవోసీ ఫిట్ కార్యదర్శి రాకం అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇల్లెందు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, ఐఎన్‌టీయూసీ ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహబూబ్, ఇల్లెందు ఏరియా బ్రాంచి సెక్రటరీ భూక్యా నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రామారావు, కేవోసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు రాములు, బాసు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

సత్రం భూమి ఆక్రమణకు యత్నం

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 22: కొత్తగూడెం పట్టణం, ఉర్ధూఘర్ సమీపంలోని బస్‌స్టాప్ వద్ద ఉన్న చిట్టివారి సత్రం భూమిలోకి కొందరు వ్యక్తులు వెళ్లి ఆదివారం నిర్మాణాలు చేపట్టారు. సమాచారం తెలుసుకుని ఎండోమెంట్‌కు చెందిన గణేష్‌టెంపుల్ ఈవో రజనీకుమారి వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి అక్రమ నిర్మాణపు పనులను అడ్డుకున్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలోకి ప్రవేశించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై అమె ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఎటువంటి కార్యక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో నిర్మాణపు పనులు ఆగిపోయాయి. ఈవో వెంట ఆలయ సిబ్బంది. అర్చకులు ఉన్నారు. అధికారుల ఆలసత్వం వల్ల దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అశ్వాపురం, సెప్టెంబరు 22: మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం అశ్వాపురం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. గొల్లగూడెం వద్ద నాకాబందీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని నిలిపి క్షణ్ణంగా సోదాలు జరిపారు. వాహనాల ధృవపత్రాలను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి సరుకుల అందజేత

బూర్గంపాడు, సెప్టెంబరు 22: బూర్గంపాడు మండల పరిదిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో గల బత్తులనగర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబానికి చెందిన పూరి గుడిసె శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మంటలు చెలరేగి ఇంటిలోని సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, నగదును అందజేసి మోరంపల్లిబంజర గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు.

'జమిలి'పై మిశ్రమ స్పందన

అశ్వారావుపేట, సెప్టెంబరు 22: అశ్వారావుపేట పట్టణంలో ఆదివారం జమిలి ఎన్నికలు--సాధ్యాసాధ్యాలు అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రకాల అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కొందరు అనుకూలంగా, కొందరు వ్యతిరేకంగ, మరి కొందరు పలు అనుమానాలను వ్యక్తం చేసారు. సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు సంధాన కర్తగ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్., కాంగ్రెస్, సీపీఐఎంఎల్, టీడీపీ పార్టీలతో పాటు పలు సంఘాలు, సామాజిక వేత్తలు, జర్నలిస్టులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రామ్‌నాద్ కోవింద్ కమిటీ సూచనలు ప్రకారం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జమిలి ఎన్నికలు దేశానికి ఆర్థికంగా, సమయం, అన్ని కలిసివస్తాయని, ఎన్నికలన్ని ఒకేసారి పూర్తి అవ్వడంతో ఏడాదంతా రాజకీయాలకు అతీతంగా ప్రజలు, నాయకులు నడుచుకునే అవకాశం ఉందని, ఇది లాభదాయకమని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ ఎంఎల్ నాయకులు మాట్లాడుతూ చిన్న పార్టీలను కబళించే ప్రయత్నంలోనే బీజేపీ కుట్రపూరితంగా జమిలీ ఎన్నికలు నిర్వహించాలని చూస్తుందంటూ పలు అనుమానాలను వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ నాయకులు యుఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ ఆరంభంలో అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగేవని, కాల క్రమేణ సమయాలు మారి పోయాయని, ఒకే సారి అన్ని ఎన్నికలు జరిగితే మంచిదేనన్నారు. అయితే దానికి అనుగుణంగా సవరణలు జరగాల్సి ఉందన్నారు. సమన్వయ కర్త ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ జమిలీ ఎన్నికలపై అనేక సందేహాలు ఉన్నాయని, వాటన్నింటిని తీర్చిన తరువాతే చర్యలు చేపట్టాలని కోరారు. పత్రికా రిపోర్టర్లు పాశం రామారావు, అప్పారావు, నాగబాబు, సంక్రాంతి సతీష్, వాసు, ఉపాధ్యాయులు లక్ష్మీనర్సు, నరసింహారావు తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు.

పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

మణుగూరు, సెప్టెంబరు 22: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును మార్చే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని మణుగూరు చాంబర్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

'సమస్యలు పరిష్కరించండి'

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 22 : పట్టణ పరిధి నవభారత్ బృందావనం కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఆదివారం కాలనీ వాసులతో కలిసి కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ ను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. సమస్యలను పరిష్కరించేలా మునిసిపల్ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల కాలనీ నుంచి వెళ్లే మురికి కాలువను కొంతమంది పూడ్చివేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన కలెక్టర్ వెంటనే మునిసిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావుతో మాట్లడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు'

జూలూరుపాడు, సెప్టెంబరు 22: ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ మండల కార్యదర్శి గుడిపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెంలో ఆదివారం ఆటో, క్యాబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహసభలను పురస్కరించుకొని జూలూరుపాడులో ఏఐటియూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేట్ రంగంలో పనిచేస్తున్న మోటార్, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసి నిరంతరం పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పి ప్రభుత్వ సంస్థలను ప్రవేట్ పరం చేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుందని ఆరోపించారు. హక్కుల సాధనకై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

క్రీడారంగ అభివృద్ధికి సహకారం అందిస్తా: కలెక్టర్



పోటీలను ప్రారంభిస్తున్నకలెక్టర్ జితేష్ వి పాటిల్

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 22 : క్రీడారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి టెన్నీస్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మంచి క్రమశిక్షణ అలవడుతుందని, తద్వారా ఎంతటి ఒత్తిడినైనా అధికమించే సామర్థ్యం వస్తుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఇంట్లోనే ఉంచకుండా క్రీడామైదానం, ఇల్లే కాకుండా కొండలను అధిరోహించడం, ప్రకృతికి దగ్గరగా తీసుకెళ్ళడం వలన వారికి మానసిక ఉల్లాసం ఉత్సాహం పెంపొందుతుందన్నారు. పాల్వంచలోని శ్రీనివాసకాలనీ గుట్టలను, చంద్రుగొండ మండలంలోని పెద్దపాడులోగల ట్రాకింగ్ స్పాట్‌లను కూడా నెలలో ఒకటి, రెండు సార్లు వీక్షించాలని తెలుపుతూ మన జిల్లాలోని ప్రకృతి అందాలను గుర్తుచేసారు. జిల్లా టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, చీఫ్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లు, సీనియర్ ప్లేయర్లు, కలెక్టర్‌ఖు మెమెంటో అందజేసారు. అనంతరం క్రీడామైధానంలోగల ఆర్చరీ విభాగాన్ని సందర్శించి, క్రీడాకారుల నైపుణ్యతను పరిశీలించి వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా యైత్ అండ్ స్పోర్ట్స్ అధికారి పరంధామరెడ్డి, ఏసీపీ విజయబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, కోచ్ అన్నం శ్రీకాంత్, సీనియర్ ప్లేయర్లు, పలుప్రాంతాలనుంచి వచ్చిన క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

కార్మికులను కన్వర్షన్ చేయాలి

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 22: విద్యుత్ అర్టిజన్ కార్మికులను వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ (టీవిఏసి జాక్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని, పలుమార్లు అసెంబ్లీలో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ కాకుండా అర్టిజన్‌లను మోసం చేసారని విమర్శించారు. జిల్లా సర్కిల్‌లోని అనేక సబ్ స్టేషన్‌లలో కార్మికులు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, వెంటనే నలుగురు ఆపరేటర్లను ఉండే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ కే.బ్రహ్మాచారి, టీజీయూఈఈయూ అధ్యక్షులు కొలగాని రమేష్, టీవిఏసి జాక్ చైర్మన్ కూసరాజు శ్రీనివాస్, నాయకులు పులి గణేష్ బాబు, జి.వెంకన్న, రాధకృష్ణ, శరత్, పూర్ణిమ పాల్గొన్నారు.